క్లుప్తంగా

సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని స్థానిక సమస్యలపై నగర కమిషనర్ దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు విష్ణు ప్రీతమ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగర కమిషనర్ రోడ్లు, కాలువల విస్తరణపై దృష్టి పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అలాగే స్థానికంగా అన్ని కాలనీలలో కాలువలు పూడిపోయి ఉండడం, బురద మురికి నీరు పేరుకు పోయి ఉండడం, ఇలాంటి సమస్యల పై కమిషనర్ దృష్టి పెట్టాలన్నారు. 15, 16, 17 డివిజన్‌లలో డ్రైనేజీ వాటర్ సమస్య ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలేదీ..?

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజన హామీల అమలును విస్మరించిందని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం విభజన హామీలు అమలు చేయాలని వినూత్న రీతిలో నగరంలో గణపతి విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు తీవ్ర ద్రోహం చేస్తున్నాయన్నారు. కడప ఉక్కు పరిశ్రమ వస్తే రాయలసీమ లో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు షాకీర్, ఉపాధ్యక్షులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రకాశం జిల్లా సంతనూతలపాడు తహసీల్దార్ లక్ష్మినారాయణరెడ్డిపై భౌతిక దాడికి పాల్పడ్డ వ్యక్తిని తక్షణం అరెస్ట్ చేయాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(అమరావతి) జిల్లా అధ్యక్షుడు ఆర్. జీవన్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అలీఖాన్, కోశాధికారి కేపీ రోనాల్డ్ శ్యామ్యూల్ రాజ్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. తహసీల్దార్‌పై దాడికి పాల్పడ్డ వ్యక్తిని తక్షణం నాన్ బెయిలబుల్ కింద అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ నేతల ర్యాలీ



ర్యాలీగా వస్తున్న బీజేపీ నేతలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశ ప్రధాని నరేంద్రమోదీ మహిళల పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారని మహిళా మోర్చా అధ్యక్షురాలు శోభా భాయి, బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం కడప నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టిన కారణంగా నారీ శక్తి వందన్ అధినియమ్‌లో భాగంగా ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళా నాయకురాళ్లు అంబిక, ఆదూరి శారదమ్మ, భవానీరెడ్డి, పద్మావతి భాయి మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప అసెంబ్లీ కన్వీనర్ బైరెడ్డి మధుసూదన్‌రెడ్డి, బాలకృష్ణ యాదవ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌కు విద్యార్థులు



స్టడీ సెంటర్‌లో చేర్పించిన విద్యార్థులతో సీఆర్‌పీలు

కడప ఎడ్యుకేషన్ : గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్(జీఈఆర్) సర్వే ద్వారా 18 సంవత్సరాలలోపు ఉన్న ప్రతి విద్యార్థి తమ విద్యాభ్యాసాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంలో భాగంగా బుధవారం విద్యాశాఖ, సచివాలయ సిబ్బంది సంయుక్తంగా ఇంటింటి, పాఠశాలల సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కడపలోని రవీంద్రనగర్ ప్రాంతంలోని పదవ తరగతి, ఇంటర్మీడియట్‌ను మధ్యలో మానేసిన విద్యార్థులను గుర్తించారు. వారందరినీ ఓపెన్ స్కూల్ ద్వారా నగరంలోని మండల వనరుల కేంద్రంలో మధుసూదన ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో చేర్పించారు. ఈ కార్యక్రమంలో కడప మండలం సీఆర్‌పీలు ఫర్జానా, హాజీర భాను, జమిలున్నీషా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందీభాషపై పట్టు సాధించాలి

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు హిందీభాషపై పట్టుసాధించాలని అక్కాయపల్లె కార్పొరేటర్ మిట్టా శ్రీదేవి పేర్కొన్నారు. బుధవారం చెమ్మియాపేట బాలికల హైస్కూల్లో రాష్ట్రీయ భాష ప్రచార సమితి వార్త సొసైటీ ఆధ్వర్యంలో 60 రోజుల్లో హిందీ నేర్చుకోవడానికి సంబంధించిన మెటీరీయల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందచేశారు. ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాల రాష్ట్రభాషా ప్రచార సమితి అధికార ప్రతినిధి కోటా ప్రసాద్ ఆధ్వర్యంలో హిందీ పుస్తకాలు, హిందీ వర్ణమాల, చార్ట్స్, డిక్షనరీ వంటి పుస్తకాలను కార్పొరేటర్ శ్రీదేవి చేతుల మీదుగా విద్యార్థులకు అందచేశారు.

గణేష్ మహరాజ్‌కీ జై..

- ఘనంగా వినాయకుడి నిమజ్జనం
- తరలివచ్చిన భక్తజనం
- ఊరేగింపులో నృత్యాలతో సందడి చేసిన యువత
- రంగులు చల్లుకుంటూ.. ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



దేవుని కడప చెరువు వద్ద వినాయక నిమజ్జనం తిలకిస్తున్న భక్తులు



కడప నగరంలో గణనాథుని నిమజ్జనంలో భక్తుల సందడి

కడప కార్పొరేషన్: వినాయక చవితి ఉత్సవాలు కడప నగరంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక ఎన్‌జీవో కాలనీలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుని సన్నిధిలో 10వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున, మాజీ కార్పొరేటర్లు అందూరి రాజగోపాల్‌రెడ్డి, చినబాబు, అందూరి రాంప్రసాద్ రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మధుసూధన్‌రెడ్డి, సాయి మహేష్, హేమనాథ్, పవన్ పాల్గొన్నారు.

మారుతీనగర్‌లో..

కడప నగరంలోని మారుతీనగర్‌లోని బోలా పద్మావతి నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని బుధవారం మేళతాళాలతో, బాణాసంచా పేలుళ్ల మధ్య నిమజ్జనానికి తరలించారు. యువతీ, యువకులు రంగులు పూసుకొని, నృత్యాలు చేస్తూ గణేశునికి వీడ్కోలు పలికారు. 22వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

■ మారుతీనగర్ శివాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని బుధవారం నిమజ్జనం చేశారు. స్థానిక భక్తులు తరలివచ్చి ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామోత్సవంలో ఓ యువకుడు చేసిన కర్రసాము ఆకట్టుకుంది.

■ కడప నగరంలోని మట్టిపెద్దపులి కూడలి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బుధవారం ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ప్రారంభించి, భక్తులకు అన్నదానం చేశారు. అన్నదానం అనంతరం వినాయకస్వామి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

■ కడప నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఉద్యోగులు ఏర్పాటు చేసిన నిలువెత్తు ఎకో ఫ్రెండ్లీ వినాయకుడు బుధవారం మధ్యాహ్నం నిమజ్జనానికి తరలి వెళ్లాడు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై వినాయకస్వామిని నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, సూపరింటెండెంట్ జి. శివకుమార్, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

కడప ఎడ్యుకేషన్: కడప నగరం ప్రకృతినగర్‌లోని రామిరెడ్డి విద్యాసంస్థలు, ప్రకృతినగర్ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులచే ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు జయసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో భక్తులు, స్థానికులు డప్పు, వాయిద్యాల మధ్యలో స్వామిని ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్లారు.

కేఎస్‌ఆర్‌ఎంలో ..


గణపతి ఉత్సవాల్లో భాగంగా కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని కళాశాల ఎండీ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గణపతి వద్ద పూజ కార్యక్రమాలతోపాటు ఉట్టి కొట్టడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడికి పెట్టిన లడ్డుకు వేలం పాటను నిర్వహించగా కడపకు చెందిన ఏఎంఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత అనిల్ రూ.1,50,116కు దక్కించుకున్నారు. అనంతరం స్వామిని నిమజ్జనానికి ఊరేగింపుగా చెన్నూరు పెన్నానదికి తరలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి, కేఎల్‌ఎం ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ రత్నమ్మ పాల్గొన్నారు.



దేవుని కడప చెరువులో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



వినాయకుడి ఊరేగింపులో మారుతీనగర్ వాసులు





వేలంపాటలో దక్కించుకున్న లడ్డూతో కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, అనిల్ తదితరులు



వినాయకుడి వద్ద ప్రకృతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

ప్రత్యేక అలంకరణలో మారుతీనగర్ రామాలయం వద్ద కొలువుదీరిన గణనాథుడు



మట్టి పెద్దపులి కూడలి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అఫ్జల్‌ఖాన్



కడప ఎన్‌జీవో కాలనీలో వినాయకుని విగ్రహం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు



కడప రాజారెడ్డి వీధిలో వినాయకుడి ఊరేగింపులో భక్తులు



అలరించిన నృత్య ప్రదర్శన

కడప నగరంలోని రాజీవ్ పార్క్ సమీపంలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద బుధవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. సంప్రదాయ నృత్యం విశేషంగా అలరించింది. కార్యక్రమం ఆద్యంతం భక్తుల కరతాళధ్వనులు మారుమోగాయి. అంతకు ముందు వినాయకుడికి విశేష పూజలు నిర్వహించారు.

– కడప కార్పొరేషన్







ర్యాగింగ్ నిషేధంపై అవగాహన

కడప అర్బన్/చింతకొమ్మదిన్నె : విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను నిషేధించడంతో పాటు, ర్యాగింగ్ చెడు ప్రభావాలు, శిక్షాస్పద నిబంధనలపై బుధవారం కడప నగర శివార్లలోని చింతకొమ్మదిన్నె మండలం అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సును జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ సూచనల మేరకు టీం సభ్యులైన న్యాయవాది ఉదయశ్రీ, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమన్నారు. ర్యాగింగ్ జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్లు: 100, 108, 1098, 14567లకు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడి డాక్టర్ కెఎస్ శశికుమార్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ టి. రవీంద్రారెడ్డి, కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ టి. శంకర్‌రెడ్డి, అధ్యాపకులు, అన్నమాచార్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాది ఉదయశ్రీ

విజిలెన్స్ అధికారుల దాడులు

కడప అర్బన్ : కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాష ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం కడప నగర శివార్లలోని ఊటుకూరు రాజాజీ కన్వెన్షనరీని కడప విజిలెన్స్ అధికారులు, చింతకొమ్మదిన్నె ఎం.ఆర్.ఐలతో కలిసి తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో 5 హెచ్‌పి గృహ అవసర సిలిండర్లను సీజ్ చేశారు. ఈ సంస్థ యజమాని బి. మదన్‌రాజ్‌పై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలో విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో వన్‌టైం సెటిల్‌మెంట్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లించే గడువును ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. 2015, 2016, 2017, 2018, 2019 సంవత్సరాలలో తృతీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చొప్పున ఫీజు చలానా ద్వారా చెల్లించాలన్నారు.

కరువు మండలాలను ప్రకటించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయని, కరువు మండలాలను ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి అన్వేష్ తెలిపారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో కరువు మండలాలను ప్రకటించాలని కోరుతూ, ఈనెల 25వ తేదీన మండల కేంద్రాలలో నిర్వహిస్తున్న ధర్నాలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు.

కొండగోపాలస్వామి ఆలయ ప్రదేశాన్ని పరిశీలించిన డీఎఫ్‌ఓ

అట్లూరు : లంకమల్లేశ్వర అభయారణ్యంలో వెలసిన కొండగోపాలస్వామి ఆలయ ప్రదేశాన్ని బుధవారం సోషల్ ఫారెస్టు డీఎఫ్‌ఓ నాగార్జునరెడ్డి, సిద్దవటం రేంజ్ అధికారి కళావతి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండగోపాలస్వామి ఆలయ ప్రదేశంలో ఎకో టూరిజం పార్క్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు.

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జున రెడ్డి

కమలాపురం : కమలాపురం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలదించడమే లక్ష్యంగా నూతన ఆసుపత్రి భవనం రూపుదిద్దుకుందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి స్పష్టం చేశారు. రూ.8.5 కోట్ల వ్యయంతో అత్యాధునిక వసతులతో నిర్మించిన 30 పడకల ఆసుపత్రి భవనాన్ని ఆర్టీసీ ఛైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలిసి బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రిని వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దడమే తన ముందున్న లక్ష్యం అన్నారు. ఇప్పటికే డ్రైనేజ్, పాలిటెక్నిక్ కళాశాల పూర్తి చేశామన్నారు. రూ.58 కోట్లతో పైప్‌లైన్, ఓవర్‌హెడ్ ట్యాంకులు, రోడ్డు విస్తరణ, డివైడర్ పనులు జరుగుతున్నాయన్నారు. పట్టణంలో రూ.280 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పులివెందుల తర్వాత కమలాపురం నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ పుల్లారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.



ఆసుపత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జున రెడ్డి


రైతు పక్షపాతి

కమలాపురం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. 80 శాతం రాయితీతో మినుము విత్తనాలను కమలాపురం 4వ ఆర్‌బీకేలో బుధవారం రైతులకు ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు అనుకున్న స్థాయిలో కురవకపోవడంతో మినుము విత్తనాలు పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, నరేన్ రామాంజులరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

కమలాపురం : పట్టణంలోని జెండా చెట్టు, శివాలయం, కోట వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంగంపల్లె ఎస్సీ కాలనీలో రామాలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. రామాంజులరెడ్డిని పట్టణంలోని శీలా వీధికి చెందిన యువత ఘనంగా సన్మానించారు.

సింహ వాహనంపై శ్రీరంగనాథుడు



పులివెందుల టౌన్: నూలు పూజ ప్రవిత్రోత్సవాల్లో భాగంగా శ్రీరంగనాథుడు సింహ వాహనంపై సతీ సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. పులివెందుల మున్సిపాలిటీలోని రంగనాథస్వామి ఆలయంలో బుధవారం రెండో రోజున అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ప్రత్యేక పూజలు జరిపి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వనభోజనం చేశారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ కెవి.రమణ పర్యవేక్షించారు.

పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణకు చర్యలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పోలింగ్ స్టేషన్ల మార్పులు, చేర్పులతోపాటు క్రమబద్ధీకరణపై తగిన చర్యలు తీసుకుంటూ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నామని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం కడప నగరంలోని తన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ కారణాలు, సమస్యల కారణంగా నగర పరిధిలో కొన్ని పోలింగ్ స్టేషన్లు క్రమబద్ధీకరణ చేపట్టామన్నారు. అలాగే శిథిలావస్థలో ఉన్న మరికొన్ని పోలింగ్ స్టేషన్లను మార్చాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అలాంటి వాటిపై నివేదికలు రూపొందించి కలెక్టర్‌కు ప్రతిపాదిస్తున్నామన్నారు. అలాగే 15 పోలింగ్ స్టేషన్ల పేర్ల గురించి కూడా ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. వీటిపై కలెక్టర్ నుంచి ప్రతిపాదనలు రాగానే అందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికల కమిషన్‌కు సిఫార్సు చేస్తామని ఆయన వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ అంశంగా తమవంతుగా సహకారాన్ని అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కడప తహసీల్దార్ శివరామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి